క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చందు

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డు ఎల్వీనగర్‌లో రూ.50 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు చట్టి గోపి, కృష్ణంరాజు, కొణతాల రాము, మురళీదేవి, పావని, కొయిలాడ శంకరరావు, బాబులునాయుడు, కె.ఎస్.నాయుడు, అచ్చిబాబు, రాజారావు, అంజిబాబు, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన ఫ్రిజ్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి సమీపంలోని దుకాణంలో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. గురువారం యజమాని రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లి పోయారు. శుక్రవారం ఉదయం పొగలు రావడం గమనించి యజమానికి సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత మంటలు చెలరేగి దుకాణంలో వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ. లక్ష విలువైన వస్తువులు దగ్ధమయ్యాయని యజమాని వాపోయాడు.

బీజేపీ నాయకులకు నియామక పత్రాల అందజేత



కృష్ణంరాజుకు నియామకపత్రం అందజేస్తున్న మాధవ్

గాజువాక: బీజేపీ జిల్లా కార్యవర్గంలోని వివిధ పదవుల్లో నియమితులైన ఆ పార్టీ గాజువాక నాయకులకు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పత్రాలను అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా దీనంకొండ కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా సిరసపల్లి నూకరాజు, కార్యదర్శిగా లక్కరాజు సోంబాబు, సోషల్ మీడియా కన్వీనర్‌గా బొండా శ్రీదేవి నియమితులయ్యారు. వీరితోపాటు మరికొందరికి కార్యవర్గ సభ్యులుగా అవకాశం కల్పించారు.

ఆక్రమిత భూములు ప్రభుత్వానివే..

తహసీల్దార్ శ్రీనివాస్

సాక్షి ఎఫెక్ట్..

కూర్మన్నపాలెం: పెద్ద ఎత్తున దుమారం రేపిన కూర్మన్నపాలెం భూ ఆక్రమణలపై గాజువాక తహసీల్దార్ బి.శ్రీనివాసరావు ఎట్టకేలకు స్పందించారు. ఆక్రమిత భూములు పోరంబోకు వాగులేనని తేల్చి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రికార్డులను పరిశీలించగా కూర్మన్నపాలెం సర్వేనెంబర్ 27లో 5.48 ఎకరాల భూమి పోరంబోకుగా నమోదై ఉందని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా ఆ భూమిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్, స్టేటస్‌కో ఉందని ఆయన తెలిపారు. అయినప్పటికీ సొసైటీ నిర్మాణాలు చేపట్టిందని.. అందు వల్ల ప్రభుత్వపరంగా చట్టపరమైన చర్యలు తీసుకొంటామని చెప్పారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆ భూమిని కాపాడతామని తహసీల్దార్ తెలిపారు. 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన అధికారపార్టీలో చిక్కులు రాజేసిన భూఆక్రమణలు అనే శీర్షికను పొందుపరిచారు. రెండు రోజులుగా ప్రచురితం అవుతున్న వార్తలకు వివరణ ఇస్తున్నట్టుగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏటీఎంలు వెలవెల.. డిజిటల్ పేమెంట్లు కళకళ





పాతగాజువాకలో ఖాళీగా దర్శనమిస్తున్న ఎస్‌బీఐ ఏటీఎం

గాజువాకలో తగ్గిన ఏటీఎంలు

డిజిటల్ లావాదేవీల వైపు ఖాతాదారుల మొగ్గు

ఒకప్పుడు ఆటోమేటెడ్ టెల్లర్ మెషీన్ (ఏటీఎం)లో డబ్బులు తీసుకోవడం ఒక వింత. బ్యాంకుకు వెళ్లకుండా.. విత్‌డ్రా ఫాం, చెక్కు వంటివి ఇవ్వకుండా చిన్న కార్డుతో మెషీన్‌నుంచి డబ్బు తీసుకోవడం ఒక సాంకేతిక విప్లవం. అప్పుడు అదే గొప్ప. ఇప్పుడు ప్రపంచం డిజిటల్ మయంగా మారింది. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ (యూపీఐ) చెల్లింపులే కనిపిస్తున్నాయి. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే పేమెంట్ అయిపోయినట్టే. ఒక వెలుగు వెలిగిన ఏటీఎంలు డిజిటల్ విప్లవంతో వెలవెలబోతున్నాయి. దీంతో బ్యాంకులు కూడా తమ ఏటీఎంలను క్రమంగా తగ్గించేస్తున్నాయి. ఒక్క గాజువాక ప్రాంతంలోనే దాదాపు పాతిక ఏటీఎంలు తగ్గిపోయాయి.

– గాజువాక

జేబులో పర్సు లేకపోయినా, చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా.. చివరకు డెబిట్, క్రెడిట్ కార్డులు కూడా వెంట తీసుకెళ్లకపోయినా.. చేతిలో స్మార్ట్ మొబైల్ ఉంటే పనైపోతోంది. పాల ప్యాకెట్ కొనుగోలు చేసినా, హోటల్‌లో భోజనం చేసినా, సెలూన్లలో మేకోవర్ చేయించుకున్నా.. మార్కెట్‌లో కూరగాయలు మొదలుకొని దుకాణంలో సరుకుల వరకు, కొత్తిమీర కట్ట నుంచి బైక్ పెట్రోల్ వరకు అన్నీ డిజిటల్ పేమెంట్‌తోనే కొనేయవచ్చు. దీంతో ఏటీఎంల వద్ద డబ్బుల కోసం క్యూ కట్టే పని తప్పిపోయింది.



బీసీ రోడ్‌లో యూనియన్ బ్యాంక్ ఏటీఎం

ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం

దుకాణంలో టీ తాగేవారు సైతం ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు. చిరు వ్యాపారులు కూడా డిజిటల్ పేమెంట్లకే అలవాటు పడ్డారు. పండ్లు విక్రయించే బండి మొదలుకొని గంపలపై పళ్లు పెట్టుకొని అమ్ముకొనే వ్యాపారులు కూడా ఫోన్ పే అంటున్నారు. బ్యాంక్ ఖాతాలో డబ్బులుండి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు.. అన్ని పనులు సులభంగా జరిగిపోతున్నాయి.

పేమెంట్ యాప్‌ల హవా

ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, రేజర్‌పే తదితర థర్డ్ పార్టీ యాప్‌ల సాయంతో జనం ఆన్‌లైన్ లావాదేవీలను సులభంగా చేస్తున్నారు. లక్ష రూపాయల కంటే తక్కువ పరిధిలో సురక్షితమైన చెల్లింపులు జరుగుతుండడవతో వీటికి ఆదరణ లభిస్తోంది. కిరాణా, నిత్యావసరాలు, వాహనాలకు ఇంధనం, మొదలు మొబైల్, డీటీహెచ్ రీచార్జిలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, రుణాల చెల్లింపులు, నగదు బదిలీ, షాపింగ్, వినోదం తదితర అవసరాలన్నింటికీ ఈ యాప్‌లనే ఉపయోగిస్తున్నారు.

నగదు జమ చేసుకోవడానికే..

ఖాతాదారులు నగదును తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవడానికే ఏటీఎంలను ఎక్కువగా ఉపయోగిస్తున్నట్టు బ్యాంకర్లు పేర్కొంటున్నారు. పేమెంట్లన్నీ డిజిటల్‌గా జరిగిపోతుండడంతో ఏటీఎంలలో విత్ డ్రా చేయాల్సిన అవసరం ఏర్పడడం లేదు. ఖాతాదారులు బ్యాంకుల్లోకి వెళ్లి నగదు జమ చేయాలని అడిగినా పక్కనే ఉన్న ఏటీఎంలోకి వెళ్లి జమ చేసుకోండని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఖాతాదారులు నగదును జమ చేయడానికి ఆన్‌సైట్ ఏటీఎంలను ఉపయోగిస్తున్నారు.

బ్యాంకుల విలీనమూ కారణమే

ఇదిలా ఉండగా, ఇటీవల బ్యాంకుల విలీనం కూడా కొన్ని ఏటీఎంల మూసివేతకు కారణంగా చెబుతున్నారు. రెండు బ్యాంకులను విలీనం చేసి ఒక్క బ్యాంకుగా మార్చండంతో వాటికి సంబంధించిన ఆఫ్‌సైట్ ఏటీఎంలను కొన్నిచోట్ల మూసివేశారు. గాజువాకలో ఈ విధంగా సుమారు పదికి పైగానే ఏటీఎంలు మూతపడినట్టు తెలుస్తోంది.

తగ్గిపోయిన విత్‌డ్రాలు

డబ్బు విత్‌డ్రా చేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయినట్టు బ్యాంకర్లు చెబుతున్నారు. దీనివల్ల బ్యాంకులకు ఏటీఎంల నిర్వహణ ఖర్చు పెరిగి పోతోంది. దీంతో బ్యాంకులే ఏటీఎంల సంఖ్యను తగ్గించుకొంటున్నాయి. 2023కు ముందు ఏటీఎంల సంఖ్య పెరిగినప్పటికీ ఇప్పుడు మాత్రం తగ్గుముఖం పట్టాయి. ఏటీఎంలలో రెండు రకాలుంటాయి. ఒకటి ఆన్‌సైట్ ఏటీఎం కాగా, మరొకటి ఆఫ్‌సైట్ ఏటీఎం. బ్యాంకు ఉన్న ప్రతి చోటా ఏర్పాటు చేసిన ఏటీఎంను ఆన్‌సైట్ అంటారు. బ్యాంకు లేని ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఏటీఎంలను ఆఫ్‌సైట్ అంటారు. పెద్ద పెద్ద జంక్షన్లు, షాపింగ్ మాళ్లు వంటి ప్రదేశాల్లో ఇవి ఉంటాయి. ప్రస్తుతం అన్నిచోట్లా డిజిటల్ లావాదేవీలు జరుగుతుండడంతో బ్యాంకులు ఆఫ్‌సైట్ ఏటీఎంలను తగ్గించుకొంటున్నాయి. బ్యాంకులు కొత్తగా తెరుస్తున్న ఏటీఎంల కంటే మూసేస్తున్నవే ఎక్కువగా ఉన్నాయి.

డిజిటల్ పేమెంట్ ఈజీ

డబ్బులు పోతాయన్న భయం లేదు. డబ్బులు వెంట తీసుకెళ్లకపోయినా ఇబ్బంది ఉండడంలేదు. డిజిటల్ పేమెంట్లతో ఎంతో సౌఖ్యంగా ఉంది. చిల్లర సమస్య కూడా ఉండడంలేదు. మనకు కావాల్సిన వస్తువు, సేవలను పొందిన తర్వాత క్షణాల్లో పేమెంట్ అయిపోతోంది. ప్రపంచం మన సొంతమైపోయినట్టుగా ఉంటుంది.

– కె.ఎల్.రాజు, గాజువాక

సేఫ్ బ్యాంకింగ్ అలవర్చుకోవాలి

ఖాతాదారులు సేఫ్ బ్యాంకింగ్ అవర్చుకోవాలి. కొంతమంది నకిలీ వ్యక్తులు బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీలు, పిన్ నంబర్లు అడిగితే పొరపాటున కూడా చెప్పొద్దు. అలా అడిగారంటే వెంటనే ఆ కాల్ కట్ చేసి బ్యాంకులో సంప్రదించాలి. నగదు లావాదేవీలు పూర్తిగా తగ్గించి ఆన్‌లైన్ ద్వారా చేసుకోవడంవల్ల చాలా ప్రయోజనాలున్నాయి.

– పూర్ణచందర్, బ్యాంక్ మేనేజర్

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: మండలంలోని కోరాడ జంక్షన్‌లో మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ 14వ వార్షికోత్సం సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ జాగరపు శ్రీను ఆధ్వర్యంలో వందేభారత్ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో రక్తనిల్వలు నిండుకుంటున్నాయని, ఈ పరిస్థితుల్లో రక్తదానం శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరించడం అభినందనీయమన్నారు. రక్తదానంపై అపోహలొద్దన్నారు. ప్రతి ఒక్కరూ రక్తం దానం చేసి మరొకరి ప్రాణం కాపాడాలని పిలుపునిచ్చారు. శిబిరంలో మొత్తం 150 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే ఉచిత నేత్ర వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, ఇమ్రాన్, నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, ప్రసాదుల శ్రీనివాసరావు, పల్లా చినతల్లి, కేసారపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మరో వ్యక్తి అరెస్టు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద మొల్లి సంతోష్‌కుమార్‌పై జరిగిన దాడి కేసులో మరో వ్యక్తిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 25న జరిగిన కొంత మంది సంతోష్‌కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ దాడిలో పాల్గొన్న వారిలో 10 మందిని ఇప్పటికే అదుపులో తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. శుక్రవారం ఈ కేసులో ఏ13 ఇందల నరసింహానాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపారు.

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే..



కన్యకాపంచాయతన దేవాలయంలో సామూహిక కుంకుమ పూజలు



అగనంపూడి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



త్రిశక్తి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



త్రిశక్తి ఆలయంలోమహాలక్ష్మి

పెదగంట్యాడ: శ్రావణమాస రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాల్లో కొలువైన అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

హౌసింగ్‌బోర్డు కాలనీలోని కన్యకాపరమేశ్వరిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన జరిపించారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మాకాలనీలోని దుర్గాదేవికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

అగనంపూడిలో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు జాబిలి హిల్స్ కాలనీలోని ఉమా రామలింగేశ్వర దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాస పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉక్కు త్రిశక్తి ఆలయంలో..

ఉక్కునగరం: మహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతిలు వెలసిన త్రిశక్తి ఆలయంలో శ్రావణమాస పూజలు వైభవంగా జరిగాయి. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా వేకువజామున మహాదుర్గకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం ఆలయ ప్రధానర్చకులు ఫణిశర్మ నేతత్వంలో మహాలక్ష్మికి సామూహిక లక్ష్మీపూజ నిర్వహించారు. అమ్మవారికి సహస్ర కలువ పుష్పార్చన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజావ్యతిరేకతను తప్పించుకోవడానికి టీడీపీ నేతల పాట్లు



ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న మరో వర్గం నాయకులు

కూర్మన్నపాలెం: భూ ఆక్రమణలపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అందులో నుంచి టీడీపీ నాయకులు నానాతంటాలు పడుతున్నారు. సర్వేనెంబర్ 27లో రాత్రికి రాత్రే రేకుల షెడ్లు నిర్మితం కావడం వెనుక టీడీపీ నాయకులు ఉన్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నిన్నటికి నిన్న 86వ వార్డు కార్పొరేటర్ కోటేశ్వరరావు ఆక్రమిత భూముల్లో పర్యటించి నిర్మాణ పనులు నిలిపివేశారు. అలా చేయడం ద్వారా ఆ ఆక్రమణల్లో తమ పాత్ర లేదని నిరూపించుకొనేందుకు తాపత్రయపడ్డారని తేటతెల్లమైంది. ఇది గమనించిన వార్డులోని మరో వర్గానికి చెందిన నాయకుడు నల్లూరి సూర్యనారాయణ తన అనుచరులతో శుక్రవారం ఆ కట్టడాలను పరిశీలించారు. తమకు కూడా ఈ కట్టడాలతో సంబంధం లేదని చెప్పడానికి ప్రయత్నం చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కూడా ఎవరినీ కట్టకోమని చెప్పలేదని తెలిపారు. చట్టపరమైన పత్రాలు ఎవరివద్ద ఉంటే వారికే సహకరిస్తామని సూర్యనారాయణ తలిపారు. మొత్తానికి అక్కడ నిర్మాణాలు నిలిపివేయడంతో ప్రజలే గెలిచినట్లు అయింది.

కుట్రపూరితంగా కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

ధ్వజమెత్తిన సీఐటీయూ నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఐదు వేలమంది కాంట్రాక్టు కార్మికులను ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా తొలగించాయని విశాఖ పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ (సీఐటీయూ) నాయకులు పేర్కొన్నారు. ఈ కుట్రలో స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ భాగస్వాములయ్యారని ఆరోపించారు. కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్‌తో పోరుబాట నిర్వహించనున్నట్టు కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తెలిపారు. గాజువాక సీఐటీయూ కార్యాలయంలో పోరుబాట పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించిన ఐదువేలమంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక ఎంపీ జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించాలని, తొలగించినవారి స్థానంలో కొత్తవారిని నియమించరాదని అన్నారు. బయో మెట్రిక్‌లో ఆధార్ లింక్ ఎత్తివేసి అందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ, ఎన్.రమణ తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ కోసం భెల్ కార్మికుల ఆందోళన



భెల్ గేటువద్ద ఆందోళన చేస్తున్న ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు

గాజువాక: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భెల్‌లో హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. భెల్ మెయిన్ గేటు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జీటీపీ ప్రకాష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భెల్‌లో హయ్యర్ పెన్షన్‌కు సంబంధించిన ఈపీఎఫ్-95ను అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఉద్యోగుల పెన్షన్ కోసం డేట్ ఆఫ్ జాయినింగ్స్‌ను సరి చేయాలన్నారు. ఈ విషయంలో యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే కాలయాపన చేస్తోందని ఆరోపించారు. హైదరాబాద్ యూనిట్‌లో హయ్యర్ పెన్షన్‌ను అమలు చేస్తూ ఇక్కడ చేయకపోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉందన్నారు. దీనిపై తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అందులో భాగంగా భెల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నాయకులు సీతన్న నాయుడు, వి.ఆనందరావు, కె.విజయ్‌కుమార్, మురళీశ్వరరావు, బి.కృష్ణమూర్తి, డి.నర్సింహారావు, డి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు చోరీ కేసుల్ని ఛేదించిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ మోహన్‌రావు, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: ఇటీవల పరవాడలో జరిగిన రెండు దొంగతనం కేసులను ఛేదించినట్లు పరవాడ ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు వెల్లడించారు. ఈ దొంగతనాలకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసి, మూడున్నర తులాల బంగారు అభరణాలు, రూ.45 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. వెన్నలపాలెం సినిమాహాలు జంక్షన్‌లోని పైల వెంకటరావు నివాస గృహంలో గత నెల 22న పట్టపగలు జరిగిన దొంగతనంలో మూడు తులాల నల్లపూసలు, అర తులం బంగారు రింగులు అపహరించారు. అదే గ్రామంలో గత 29న రెడ్డి శివ ఇంట్లో చొరబడి అర తులం బంగారు చెవి దిద్దులు, రూ.60 వేల నగదును దొంగిలించారు. ఈ ఫిర్యాదులపై డీఎస్పీ ఆదేశాల మేరకు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు దర్యాప్తు ప్రారంభించి, రెండు దొంగతనాలకు పాల్పడింది ఒకరేనని తేల్చారు. కంచరపాలెంలో ఉంటున్న సబ్బవరపు కృష్ణంనాయుడు(27) ఈ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఇతడి స్వస్థలం చోడవరం ఎడ్ల వీధి కాగా, 20 ఏళ్లగా ఇతని కుటుంబం కంచరపాలెంలో నివసిస్తోంది. నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసగా మారి, ఈ దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుడు ఉపయోగిస్తున్న స్కూటీని స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసి అనకాపల్లి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. చోరీ కేసుల్ని ఛేదించడంలో కృషి చేసిన పరవాడ డీఎస్పీ, ఇన్‌చార్జ్ డీఎస్పీ, సీఐతోపాటు, క్రైం సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ ఎస్.వి.సాయిసంతోష్, కానిస్టేబుళ్లు నాయుడు, నాగేంద్రబాబు, పి.కిశోర్‌కుమార్‌లను అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు.

పూడిక తీశారు.. వదిలేశారు

- రోడ్డుపై మురుగు ప్రవాహం
- వాహనచోదకుల అవస్థలు



రోడ్డుపై వేసిన చెత్తకుప్పల నుంచి మురుగు నీరు రావడంతో అవస్థలు పడుతున్న కార్మికులు



గెడ్డల్లోంచి తీసిన చెత్త తరలించకుండా రోడ్ల పై వేసిన దృశ్యం

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వంతెన నుంచి స్టీల్‌ప్లాంట్ బీసీ గేట్‌కు వెళ్లే మార్గం మురుగు నీటిమయం అయింది. అధికారుల నిర్లక్ష్యం వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారింది. గెడ్డలో నుంచి తీసిన చెత్తను రోడ్డుపై పడేయడంతో అవస్థలు పడుతున్నారు. పెదగంట్యాడ ప్రధాన రహదారి బీసీ రోడ్డు నుంచి గంగవరం పోర్టు వంతెనపై నుంచి వెళ్లే రహదారిలో గెడ్డలోని పూడికలు తొలగించారు. అయితే పూడికను రోజుల తరబడి రోడ్డుపై వదిలేస్తున్నారు.దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలో నుంచి తీసిన చెత్త కారణంగా దుర్వాసన వస్తోందని, ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొని ఉందని చెబుతున్నారు.మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో పెద్ద వాహనం వెళ్తున్న సమయంలో బురదతుల్లడంతో దురదలు వస్తున్నాయని వాపోతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న చెత్త కనిపించకపోవడంతో వాహనాలు అదుపు తప్పి గాయాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై పడేసిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



రైల్వేట్రాక్‌పై లభ్యమైన మృతదేహం

కూర్మన్నపాలెం: రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఎన్టీపీసీ రైల్వేట్రాక్ 7–8 వద్ద మృతదేహాన్ని గమనించామని ఆయన చెప్పారు. ఆ వ్యక్తి వయస్సు 45–50 మధ్య ఉంటుందని, చామనచాయ రంగులో ఉండి ఎరుపు రంగు చొక్కా ధరించాడని ఆయన వివరించారు. అలాగే ఒక కాలు తెగి పడి ఉందని చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.